సంక్షేమ సారథి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

- ఉత్సాహంగా గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి
- హాజరైన ఎమ్మెల్యేలు మేడా, గడికోట, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి మళ్ళీ ఆయనను సీఎంను చేయాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బలిజపల్లె సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల వల్ల ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగినా మంజూరయ్యేవి కావన్నారు. అందువల్ల గత ప్రభుత్వానికి జగన్ ప్రభుత్వానికి ప్రజలు తేడా గమనించాలని కోరారు. తొలుత కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డినగర్ సర్కిల్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు.

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం అయితే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఎంజీ పురం పంచాయతీలో మంగళవారం వేడుకగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శరత్‌కుమార్‌రాజు, చొప్పా ఎల్లారెడ్డి, విశ్వనాథరాజు, రామ్మోహన్‌నాయుడు, గంగిరెడ్డి, భాస్కర్ రాజు, పెంచలయ్య, సర్పంచ్ పెంచలయ్య, ఎంపీటీసీ ఎ.మధుబాబు, ఉపసర్పంచ్ కె.రుద్రనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

రాయచోటి అర్బన్ : సీఎం జగనన్న పరిపాలనలో అర్హతే ఆధారంగా అర్హులందరికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 3వ వార్డు పరిధిలోని మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిలో ఎంతో వెనుకబడిన రాయచోటిలో అభివృద్ధిని పరుగులు పెట్టించామన్నారు. రాయచోటిని జిల్లా కేంద్రం చేసిన సీఎం జగన్‌కు ఈ ప్రాంతవాసులు రుణపడి ఉన్నారన్నారు. చంద్రబాబు తన హయాంలో తీసుకువచ్చిన శాశ్వత పథకం ఏదైనా ఉందా ? అంటూ ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు.



రాజంపేట టౌన్: కిట్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా

ఓబులవారిపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి చెందిందని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాలిరెడ్డిపల్లె గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సంక్షేమాన్ని తెలియజేయాలని వత్తలూరు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, సర్పంచ్ మేకల సుఖవేణి, ఎంపీటీసీ మేకల సరిత, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, రామచంద్రరెడ్డి జేసీఎస్ మండల కన్వీనర్ అమరేశ్వర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం : పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి అన్నారు. మండలంలోని కేశాపురంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో దేవనాథరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ దివ్య, పంచాయతీ సెక్రటరీ పద్మావతిలు పాల్గొన్నారు. దేవనాథరెడ్డి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే సీఎం జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలన్నారు.



చిన్నమండెం: వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న దేవనాథరెడ్డి, నాయకులు

రామాపురం : ఆర్థికంగా, సామాజికంగా పేదలు అభివృద్ధి చెందితేనే ప్రగతి సాధ్యమని మండల పార్టీ కన్వీనర్ మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి , జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డిలు అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని గోపగుడిపల్లెలో జరిగిన ఏపీకి సీఎం జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజలకు సంక్షేమ లబ్ధి, అభివృద్ధి వివరిద్దామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంగర సుబ్బయ్య, మాజీ సర్పంచ్ బసయ్య, ఉప మండల అధ్యక్షుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉపాధి సామాజిక తనిఖీపై ప్రజావేదిక

సిద్దవటం : జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి బుధవారం సిద్దవటంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీపై ప్రజా వేదిక జరుగునని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఆపస్‌కు నూతన కార్యవర్గం

లక్కిరెడ్డిపల్లె : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) లక్కిరెడ్డిపల్లె మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం లక్కిరెడ్డిపల్లె జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్)లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు నరసింహులు వ్యవహరించారు. మండల గౌరవ అధ్యక్షుడిగా బి.రామాంజనేయులు, మండల అధ్యక్షుడిగా టి.రాజా, ప్రధాన కార్యదర్శిగా జి.మనోహర్, కోశాధికారిగా రవిశంకర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, టి.సాయిచరణ్ యాదవ్, వీరస్వామి, కార్యదర్శులుగా చెల్లు సురేంద్ర, మహిళా కన్వీనర్‌గా జయంతిలు ఎంపికయ్యారు.

అప్రమత్తంగా ఉండండి

చిట్వేలి : సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేరాలు, ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, పోక్సో కేసులు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంగయ్య, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, మహిళా కానిస్టేబుల్ రాధిక, ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు రెడ్డివారిపల్లె అరుంధతివాడలో బాల భక్త మౌనీశ్వర ఆలయం నిర్మాణానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ విరాళం అందించింది. మంగళవారం ముక్కావారిపల్లె తన క్యాంపు కార్యాలయంలో రూపానందరెడ్డి రూ. 50 వేల చెక్కును అందించారు.

దారి సమస్య పరిష్కారం

గాలివీడు : దశాబ్దాల కాలంగా తీరని దారి సమస్యకు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చొరవ చూపడంతో అధికారులు పరిష్కార మార్గం చూపారు. మండల కేంద్రంలోని శెట్టివారిపల్లెలో రూ.8 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డును వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, జేసీ కన్వీనర్ ఖాదర్ మొద్దీన్‌లు టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, గంగాధర్ నాయుడు, నర్సరీ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ వెంకటరత్నం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీలో ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో ఏఐటీయూసీ యూనియన్ నాయకులు, కార్మికులతో సమావేశం నిర్వహించి ఓబులేసు మాట్లాడారు. ఏపీఎండీసీ గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. అలానే ఖాళీగా ఉన్న 450 పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం ఏపీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కొరముట్ల శ్రీరాములు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఒంటిమిట్ట : సిద్దవటం, ఒంటిమిట్ట పోలీసు స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు మంగళవారం ఒంటిమిట్ట సర్కిల్ ఆఫీస్‌లో కౌన్సెలింగ్ ఇచ్చామని కడప డీఎస్పీ షరీఫ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేటట్లు చూడాలన్నారు. సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, ఎస్ఐ లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

రాజంపేట రూరల్ : విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహించినట్లు అధికారులు తెలియజేశారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం స్థానిక డివిజనల్ విద్యుత్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక అదాలత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి(విశ్రాంత జడ్జి), ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజన్‌కుమార్, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ, డివిజన్ ఈఈ ఎస్.రాజశేఖర్‌రెడ్డిలు పాల్గొని వినియోగదారుల సమస్యలు విని వారి వద్ద నుంచి సమస్యను వినతిపత్రం రూపంలో తీసుకున్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

నందలూరు (రాజంపేట)/రామాపురం/పుల్లంపేట/రాయచోటి టౌన్/సంబేపల్లె/ఓబులవారిపల్లె : దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన విశేష సేవలను విద్యార్థులకు వివరించారు. చిన్నారులంటే ఎంత ఇష్టమో తెలియజేశారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చేసిన పోరాటాన్ని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పలు పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

సిద్దవటం : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఘనంగా ప్రారంభించినట్టు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీరాములు, గ్రంథాలయ అధికారిణి లక్ష్మీదేవి తెలిపారు. దీనిలో భాగంగానే నవంబర్ 14వ తేదీ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాలలో పాఠకులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి రెడ్డి శేఖర్ కోరారు.

చిట్వేలి : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నెహ్రూ జయంతిని పురస్కరించుకొని మంగళవారం చిట్వేలిలోని గ్రంథాలయంలో గ్రంథపాలకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

నందలూరు (రాజంపేట) : జాతీయ 56వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 15వ తేదీన విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గులు, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి రవిశంకర్ రాజు తెలిపారు. మంగళవారం దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

రామాపురం : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఎంఈఓ రామకృష్ణుడు మంగళవారం ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రతి ఏడాది నెహ్రూ పుట్టిన రోజును పురస్కరించుకొని జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జరుగుతాయన్నారు. గ్రంథాయాల విశిష్టతను అందరికి తెలియజేసేందుకు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

శ్మశానవాటిక రోడ్డుకు సహకారం

సిద్దవటం : మాధవరం – 1 గ్రామ పంచాయతీలోని హిందూ శ్మశానవాటిక రహదారికి సహకరిస్తామని వైఎస్ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్ రెడ్డి తెలిపారు. గత 30 ఏళ్లుగా శ్మశానవాటికకు రహదారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని మంగళవారం మాధవరం గ్రామ మధుసూదన్‌రెడ్డికి తెలియజేయడంతో శ్మశానవాటికను పరిశీలించి తక్షణమే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో బెటాలియన్ పోలీసుకు తీవ్రగాయాలు

సిద్దవటం : మండలంలోని పార్వతీపురం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కానిస్టేబుల్ సురేష్‌బాబుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బెటాలియన్ కానిస్టేబుల్ సురేష్‌బాబు పార్వతీపురంలో మంగళవారం రాత్రి హోటల్‌లో చపాతి కట్టించుకుని బెటాలియన్‌కు వచ్చేందుకు ద్విచక్ర వాహనం ఎక్కుతుండగా భాకరాపేట వైపు నుంచి ఒంటిమిట్టవైపు ప్రయాణిస్తున్న ఆటో సురేష్‌బాబును వెనుక వైపు ఢీకొనడంతో కానిస్టేబుల్ సురేష్‌బాబుకు తీవ్ర గాయాలైనట్టు తెలిపారు. దీంతో వైద్యం కోసం స్థానికులు 108లో కడప రిమ్స్‌కు తరలించారు.

రికార్డులు పెండింగ్‌లో ఉంచకూడదు

సిద్దవటం : మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థుల హాజరు, పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని కనమలోపల్లి, భాకరాపేట, సిద్దవటం దిగువపేట గాంధీ వీధిలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశామన్నారు. గాంధీ వీధిలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనంను పరిశీలించి తిన్నామన్నారు. భోజనాలు బాగున్నాయని సంతృప్తిని వ్యక్తం చేశారు. అంతేగాకుండా విద్యా కమిషనర్ డిశంబర్‌లో జిల్లాకు వస్తున్నారన్నారు. కావున పాఠశాలలోని రికార్డులను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు లెసెన్ ప్లాన్, టీచర్స్ డైరీని తప్పక రాయాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో టోఫెల్ నోడల్ ఆఫీసర్ డి.వి.ఎస్. ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణతో మంచి దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె : కందిలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పీర్ సాహెబ్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. మంగళవారం దిన్నెపాడు పంచాయతీలోని పర్వతరెడ్డిగారిపల్లి, దిన్నెపాడు గ్రామాలలో కంది పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కంది మొగ్గ దశలో ఉన్నప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. కందిలో ఎక్కువగా శనగపచ్చ పురుగు మొదట దశలో లార్వాను గుర్తించాలన్నారు. దీని నివారణకు నువన్‌ను పిచికారీ చేయాలన్నారు. వెర్రి తెగులు సోకిన మొక్కలు వేరివేయాలన్నారు. అనంతరం మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. నవంబర్, డిసెంబర్ మాసాలలో మామిడిలో చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. తేనెమంచు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని, ఇది మంచుకు ఆశిస్తుందని, పూత రానివ్వకుండా చేస్తుందని, దీని నివారణ చేపట్టాలని రైతలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు పవన్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రతి గడపకూ

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు : ప్రజల సమస్యలను తీర్చేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం కొండూరు పంచాయతీలోని గట్టువారిపల్లి, కొత్తదామనచెర్ల, వెంగమాంబపురం, పాత దామనచెర్ల గ్రామాలలో మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల పత్రాలను అందించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని దామనచెర్ల గ్రామం అటవీప్రాంతమని, గతంలో ఇక్కడివారు పనులు లేక ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల వల్ల నేరుగా వారి ఖాతాలలో నగదు జమకావడంతో వారు జీవితాలను ఆనందమయంగా గడుపుతున్నారన్నారు. సంక్షేమాభివృద్ధిని అందిస్తున్న వైఎస్ జగన్‌ను మరొక్కసారి ఎన్నుకుందామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కొండూరు సర్పంచ్ రామాంజులమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేతా చక్రపాణి, సిద్ధవరం శ్రీనివాసులు రెడ్డి, కన్నారెడ్డి, శ్రీపతి రెడ్డి, ప్రసాద్, కుమార్, వెంగయ్య, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెనగలూరు: సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, కొండూరు విజయ్ రెడ్డిలు

ప్రజల జీవన ప్రమాణాలు మారాయి

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన పథకాల వల్ల గత నాలుగేళ్లలో ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మారాయని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. మండలంలోని అనంతరాజుపేట సచివాలయం – 2లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో కొరముట్ల పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ ప్రాంగణంలో జరిగిన బాలల దినోత్సవంలో ప్రభుత్వవిప్ పాల్గొని విద్యార్థులతో గడిపారు. కార్యక్రమంలో సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ సుబ్బరామరాజు, సుధాకర్, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీలు జనార్దన్ రాజు, బండారు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

పెనగలూరు : పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరంలాంటిదని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పెనగలూరు పంచాయతీకి చెందిన ఇప్పగుంట శివారెడ్డి కుటుంబానికి మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డితో కలిసి రూ. 12 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను వారు అందించారు.

తక్కువ వడ్డీకే రైతుకు రుణాలు

సిద్దవటం : వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా తక్కువ వడ్డీకే రైతులకు రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని సింగిల్ విండో అధ్యక్షుడు జ్యోతి జగదీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగదీష్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సహకార పరపతి సంఘాల ద్వారా భూమిని బట్టి ఒక వ్యక్తికి రూ. 8లక్షల వరకు గరిష్టంగా రుణాలను మంజూరు చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిద్దవటం బ్రాంచి డీసీసీ బ్యాంకు మేనేజర్ సుచిత్ర మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు ద్వారా వ్యక్తిగత, విద్యార్థుల ఉన్నత చదువులకు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు, చిరు వ్యాపారులకు, హౌసింగ్, వాహనాలకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సిద్దవటం బ్రాంచి అసిస్టెంటు మేనేజర్ వెంకటసుబ్బమ్మ, సూపర్‌వైజర్ రాజశేఖర్, సిద్దవటం, అట్లూరు సీఈఓలు సుకూర్, గుర్రయ్య, డైరెక్టర్ నారపురెడ్డి, పుల్లారెడ్డి, రైతులు జవహర్‌బాష, సంజీవరెడ్డి, బాలిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, దశరథరామ నాయుడు, నారాయణరెడ్డి, ఎస్.వి. సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మరి కొందరు రైతులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

రాజంపేట : విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏఐటీఎస్ ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి అన్నారు. మంగళవారం జేఎన్‌టీయూ – ఏ నిర్వహించిన వివిధ పోటీలలో, జట్టు ఎంపికలలో ప్రతిభ చాటుకున్న విద్యార్థులను ఆయన అభినందించారు. మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఏఐటీఎస్ ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ తిరుపతి ఎంబీయూలో జరిగిన కబడ్డీ పోటీలలో మానస, అఖిలసాయి, మునిరాజేశ్వరరెడ్డిలు, సౌత్ జోన్ యూనవర్సిటీ టోర్నమెంట్‌కు జేఎన్‌టీయూ – ఏ తరఫున ఎంపికయ్యారన్నారు. తిరుపతి ఎస్వీ కాలేజిలో జరిగిన విలువిద్యలో జరిగిన పోటీలలో అక్షసాయి, ఎన్‌బీకేఆర్‌లో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీలలో సాయికృష్ణ, వెంకటసాయికృష్ణలు ఎంపికయ్యారన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం జీఓను సవరించాలి

రాజంపేట రూరల్/రాయచోటి టౌన్ : రాష్ట్రంలో నిత్యం ప్రజా సమస్యల పరిష్కరానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం జీఓ 395ను సవరించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు కోరారు. మంగళవారం ఏపీయూడబ్ల్యూజే నాయకులు వేర్వేరుగా రాయచోటి, రాజంపేట ఎమ్మెల్యేలైన గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డిలను కలిశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబరు 395ను సవరించాలని కోరుతూ వారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జర్నలిస్టులకు ఇంటి స్థలాలను కేటాయిస్తూ జీఓ జారీ చేసినందుకు ముందుగా కృతజ్ఞతలు తెలియజేశారు. జీఓ నెంబరు 395తో ఎంతో మంది వర్కింగ్ జర్నలిస్టులు అనర్హులుగా మిగిలిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. నియమ నిబంధనలు సవరించి ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యేలు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లతానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే మేడాకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంబేపల్లె : దేవపట్ల బస్టాండ్ సమీపంలో మంగళవారం ఆటో, స్కూటర్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో షాహిదా, రతుల నాయక్‌లకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు కడపకు చెందిన షాహిదా కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో పీలేరుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో కడపకు వస్తుండగా శెట్టిపల్లి గ్రామం, చిన్న బిడికికి చెందిన రతుల నాయక్ తన ద్విచక్ర వాహనంలో దేవపట్ల బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. గాయపడ్డ వారిని 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.